

చట్టాలను కఠినతరం చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయకపోతే మహిళలు, డాక్టర్లపై దాడులు జరుగుతూనే ఉంటాయి. ఇటీవల కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ఘటనను తలుచుకుంటే బాధేస్తోంది. ప్రజలకు వైద్యం చేసే డాక్టర్లకు రక్షణ లేకపోతే ప్రాణాలు ఎలా నిలబెడతారు. రాత్రి వేళల్లో మహిళా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు పీహెచ్‌సీలో అత్యవసర సమయాల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– బి.రాంబాబు నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి, కిర్లంపూడి

ప్రజల్లో అవగాహన పెంచాలి



కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా మొదట ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. రాత్రిపూట విధుల్లో ఉండే మహిళా వైద్యుల భద్రతపై పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలి.

– డాక్టర్ పి.మాధవి, హోమియో ఆసుపత్రి, దివిలి, పెద్దాపురం మండలం

క్లుప్తంగా

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భక్తిభావాన్ని కలిగి ఉండాలని విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షులు పట్నాయక్ అన్నారు. మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శోభారాణి, మాలతీదేవి, భానోజీరావు, నాగరత్నం పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మామిడాడ గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.10,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం నుంచి నవంబర్ నెలాఖరు వరకు పాక్షికంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 220 కేవీ విద్యుత్ వైర్ల మార్పిడి కారణంగా మూడు నెలల పాటు పలు ప్రాంతాల్లో పాక్షికంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తుని పట్టణం, తుని, కోటనందూరు, తొండంగి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ సమస్య ఉన్నందున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

దానవాయిపేటలో విద్యుత్ వైర్ల మార్పు

తొండంగి: మండలంలోని దానవాయిపేట మెయిన్ రోడ్డులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డులో ఓ భవనం వద్ద ఇటీవల విద్యుత్ వైర్లు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సమస్యపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. అనంతరం బిల్డింగ్‌కు తగలకుండా విద్యుత్ వైర్లను భవనానికి దూరంగా అమర్చారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో గుబ్బాలమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు

గోకవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గుబ్బాలమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆచంట రాజు, వైస్ చైర్మన్లుగా గంర్రెడ్డి సన్యాసిరావు, సుంకర నరేంద్ర, ముప్పిడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా అలమండ శివాజీ, ట్రెజరర్‌గా ముమ్మిడివరపు నారాయణరావు, సబ్ ట్రెజరర్లుగా గున్నూరి లాజర్, నేతల నరేంద్ర, పలువురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసరి తమ్మన్నదొర, గాజింగం సత్తిబాబు, మంగరౌతు రామకృష్ణ, అడపా భరత్‌బాబు, బత్తుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల ముగింపును పురస్కరించుకుని కృష్ణుని ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలురకాల వంటకాలతో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈగల అప్పారావు, కలగాని దేవుళ్లు, కోన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంఖవరం: మండలంలోని కత్తిపూడి గ్రామానికి చెందిన ఓ యువకుడు గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అన్నవరం పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం కత్తిపూడి గ్రామానికి చెందిన మచ్చా ఈశ్వర్ (16) ద్విచక్ర వాహనంపై నెల్లిపూడి వెళ్లుతుండగా నెల్లిపూడి నుంచి కత్తిపూడి వైపు వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహన్ని పంచనామా నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అన్నవరం ఎస్సై వి.కిశోర్ తెలిపారు.

పత్తి.. తెగుళ్లు ముంచెత్తి..

- పొంచిఉన్న వాయుగుండం ముప్పు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులతో మేలు



టి.తిమ్మాపురంలో ముంపునకు గురైన పత్తిపంట



కాండాన్ని పురుగు తొలిచేయడంతో నేలకొరిగిన పత్తిమొక్క

తుని రూరల్: తొలిదశలో వర్షాభావం, ఇప్పుడు అధిక వర్షాల కారణంగా పత్తిపంటపై తెగుళ్లు, పురుగులు దాడి చేస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి చేలు ముంపునకు గురవుతున్నాయి. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పూత, పిందెల దశలో ఉన్న పత్తిపంటకు నష్టం వాటిల్లుతోంది. వరద నీటితో కొన్ని ప్రాంతాల్లో ముంపు వీడడం లేదు. వారంరోజులు ఎండలు కాస్తేనే పంట దక్కుతుందని రైతులు పేర్కొన్నారు. ఈ దశలో 30 నుంచి 40 రోజుల మధ్య పత్తి పంటలో మొక్కల ఎదుగుదల క్షీణించడం, ఎదిగిన కొమ్మలు, మొక్కల మొదళ్లు విరిగిపోతుండడం, దోమలు, పురుగులు, తెగుళ్ల ఉధృతి తీవ్రంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దుకాణదారుల సూచనలతో అధిక మోతాదులో పురుగు మందులు, ఎరువులు వినియోగిస్తే మరింత నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. పత్తి పంటను ఆశించే తెగుళ్లు, పురుగులను గుర్తించి సకాలంలో వీఏఏలు, ఏఈఓలు, మండలస్థాయిలో ఏఈఓలను సంప్రదించి నివారణ చర్యలు, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే సత్ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

3708 ఎకరాల్లో పత్తి సాగు

కాకినాడ జిల్లాలో ఈ సంవత్సరం ఎనిమిది మండలాల్లో 3708 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఇందులో తుని మండలంలో 723 ఎకరాలు, తొండంగిలో 130 ఎకరాలు, శంఖవరంలో 45 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 557 ఎకరాలు, పత్తిపాడులో 395 ఎకరాలు, జగ్గంపేటలో పది ఎకరాలు, గొల్లప్రోలులో 1833 ఎకరాలు, పిఠాపురం మండలంలో 15 ఎకరాల్లో రైతులు పత్తిపంట వేశారు.

ముంపు సమస్య ఉంటే..

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఆరుతడిగా సాగయ్యే పత్తి చేలల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు నీటి కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నీటి ముంపును తట్టుకోవడానికి పోటాషియం నైట్రేట్‌ను పది గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ముంపు వల్ల వేరు కుళ్లు తెగులు వచ్చినట్టు రైతులు గమనిస్తే కాఫర్ ఆక్సీక్లోరైడ్ రెండు గ్రాముల మందును లీటరు చొప్పున నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పిచికారీ చేయాలి.

తెగుళ్ల నివారణ ఇలా..

పత్తి పంటలో రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా కనిపిస్తే లీటరు నీటిలో ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్ల మందు చొప్పున కలపి పిచికారీ చేయాలి. పూత, కాయలను పురుగులు ఆశించినట్టు గుర్తిస్తే లీటరు నీటిలో క్లోరిపైరిఫాస్ రెండు మిల్లీ లీటర్ల మందు, లేదా ప్రోఫినోఫాస్ రెండు మిల్లీ లీటర్ల చొప్పున నీటరు నిటిలో కలిపి పిచికారీ చేయాలి.

గులాబీ రంగు పురుగులు

పంటకు తీవ్రనష్టం కలిగించే గులాబి రంగు పురుగుల ఉధృతిని సకాలంలో అదుపు చేయాలి. ఎకరానికి ఆరు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రొఫినోపాస్ 400 ఎంఎల్, క్లోరిఫైరిపాస్ 500 ఎంఎల్, లార్విన్ 300 గ్రాములు, కోరాజిన్ 60 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

దోమల నివారణ

ఒక్కొక్క ఆకుకు తెల్లదోమలు ఆరు, పచ్చదోమలు రెండు, తామర పురుగులు పది ఉన్నా నివారణకు మందులు పిచికారీ చేయాలి. ఎకరానికి పిప్రోనిల్ 400 ఎంఎల్, ఉలరా 60 గ్రాములు, డైపెంథుయరాన్‌ను 200 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పత్తిపంట సమీపంలో గోగునార, బెండ తదితర పంటల సాగు చేయకూడదు. పత్తిపంటను కాపాడుకునేందుకు సకాలంలో రైతులు సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించాలి.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



పత్తి పంటను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలి. ముంపు నివారణ, వరదనీరు పొలాల్లో నిల్వ ఉండకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. నాణ్యతగల మంచి దిగుబడులు సాధించేందుకు రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు అవలంభించాలి.

– బి.అశోక్ కుమార్, ఏఓ, తుని

ప్రత్తిపాడు సీఐగా సూర్యఅప్పారావు



ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బి.సూర్యఅప్పారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ సీఐగా పని చేసిన ఎం.శేఖర్‌బాబు వీఆర్‌పై ఏలూరు రేంజ్ ఆఫీసుకు వెళ్లారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన అప్పారావు రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్ సీఐగా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. నూతన సీఐకు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు పవన్‌కుమార్, సతీష్‌బాబు, కిషోర్, వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన



తునిలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తుని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ అన్నారు. స్వచ్ఛతా వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం స్థానిక 19వ వార్డులో పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాస్టిక్ నియంత్రణ, తడి, పొడి చెత్త సేకరణ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వివిధ పార్టీల నాయకులు కుక్కడపు బాలాజీ, ఉమ్మిడి వెంకటరమణ, శానిటేషన్ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, శానిటేషన్ మేస్త్రీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తునిలో విద్యార్థుల క్రీడా ప్రదర్శన



అన్నవరంలో క్రీడాకారుడు సూరిబాబును సత్కరిస్తున్న దేవస్థానం ఉపాధ్యాయ బృందం

తుని: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని ఆలిండియా మెగాస్టార్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ రుక్మార్‌రావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, రాజా ఉన్నత పాఠశాలల్లో గురువారం ఆలిండియా మెగాస్టార్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైకిల్ ఫోటో గేమ్ నిర్వహించి విజేతలకు మెడల్స్, మెమెంటోలు, బ్యాట్స్, బాల్స్ తదితర బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి దండెం పోలారావు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ సత్యనారాయణ, అలయన్స్ క్లబ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు శేషగిరి, పీడీలు రమేష్, వేణుగోపాల్, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, కె.రవిశంకర్, డి. సతీష్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారుడు సూరిబాబుకు సత్కారం

అన్నవరం: స్థానిక దేవస్థానం హైస్కూల్ పూర్వ విద్యార్థి, క్రీడాకారుడు, జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మూడుసార్లు బంగారు పతకాలు సాధించిన కోళ్ల సూరిబాబును గురువారం ఘనంగా సత్కరించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైస్కూల్‌లో పీఈటీ పర్వత వీరేష్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. హైస్కూల్ కమిటీ కో–ఆప్షన్ సభ్యుడు తుమ్మల సత్యేంద్ర, హెచ్‌ఎం అల్లాడ వేంకటేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు మనీష్‌ను సత్కరించారు.

పింఛన్ల పంపిణీపై సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రామన్ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1న పంపిణీ చేయాల్సిన పింఛన్లను ఈ నెల 31న పంపిణీ చేయడంపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రేపు పింఛన్ల పంపిణీ

తుని రూరల్: వచ్చే నెల ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ఈ నెల 31న లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే యనమల దివ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నెల 31న పింఛన్లు తీసుకోలేని లబ్ధిదారులకు సెప్టెంబరు 2న అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

కుండపోత వాన

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గురువారం మండలంలో కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తెరిపివ్వకుండా వర్షం కురవడంతో ప్రజలకు దైనందిన కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సముద్రంలో ప్రతికూల వాతావరణం నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్. ఉమామహేశ్వరరావు సూచించారు. తీరప్రాంతంలో మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుకూల పరిస్థితులు ఏర్పడే వరకూ చేపల వేటకు వెళ్లరాదన్నారు. ఈ మేరకు తీర గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు

శంఖవరం: విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు కావాల్సిన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక కేజీబీవీలో సర్వ శిక్ష అభియాన్ నిధులు రూ.1.90 లక్షలతో నిర్మించిన నూతన భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికల అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం కేజీబీలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్వీ రమణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ బాల మణికుమారి, స్థానిక నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు, బుర్ర లచ్చబాబు, ఓలేటి లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. తమస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. తొలుత అధికారులతో ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి రాకుండా ముందస్తుగా 13 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంపీటీసీలు కొప్పుల బాబ్జీ, యిజనగిరి ప్రసాద్, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తొలుత ప్రభుత్వ నిధులతో ఆధునీకరించిన ఎంపీడీఓ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ రాము, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర



జాతరలో మహిళల కోలాట ప్రదర్శన

కిర్లంపూడి: మండలంలోని జపగతినగరంలో వేంచేసిన పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయం వద్ద నాట్య ప్రదర్శన, కోలాటం వంటి సాంఘిక కార్యక్రమాలు నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి



గొల్లలగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీరామ్

జగ్గంపేట: రైతులు తమ పొలాల్లో లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ సూచించారు. మండలంలోని గొల్లలగుంటలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో తెల్ల దోమ, నల్ల దోమ, పచ్చ దోమల నివారణకు రైతులు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు వాడరాదన్నారు. పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృతం తయారీ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించితే ముప్పు

గండేపల్లి: మోతాదుకు మించి పురుగు మందులు వినియోగిస్తే పంటలకు నష్టం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి అన్నారు. మండలంలోని గండేపల్లిలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మోతాదుకు మించి పురుగు మందులు వాడరాదన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ అంజలి, వీహెచ్‌ఏ ఉదయ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

- ఘనంగా జాతీయ మాతృభాషా దినోత్సవం
- పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు



వి.కొత్తూరు ఆశ్రమ పాఠశాలలో మాతృభాష విశిష్టతను వివరిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మల కుమారి

ఏలేశ్వరం: దేశభాషలందు తెలుగు లెస్స అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని జాతీయ తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగుభాష అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. తెలుగుభాషను గౌరవిస్తే కన్నతల్లిని గౌరవించేనట్టేనన్నారు. అనంతరం క్రీడా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగ మూర్తి, వెంకటేశ్వరావు, రామారావు, శివప్రసాద్, శ్రీలక్ష్మి, మదీనా విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారంజ జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు గణపతిరావు, మహర్షి, గంగరాజు, నరేష్‌లను ఘనంగా సన్మానించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీను, పాఠశాల హెచ్‌ఎం కె.రాఘవకుమార్ పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జాతీయ మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవాలను వైభవంగా నిర్వహించారు. వి.కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలిక పాఠశాలలో ప్రిన్సిపాల్ నిర్మల కుమారి ఆధ్వర్యంలో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం స్వీకరించారు. మేజర్ ధ్యాన్‌చాంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ క్రీడలలో నైపుణ్యాలను ప్రదర్శించారు. కేజీబీవీలో ప్రిన్సిపాల్ అమృతవాణి ఆధ్వర్యంలో విద్యార్థినులు మహనీయుల చిత్రపటాలను విశేషంగా అలంకరించి ప్రదర్శించారు. తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు అలరించారు.

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మెహర్ తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు ఎంతో కృషి చేశారన్నారు. విద్యా, ఉద్యోగ రీత్యా ఆంగ్ల, హిందీ భాషలను వినియోగిస్తున్నప్పటికీ తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైస్.ప్రిన్సిపాల్ దివాకర్, పీడీ కృష్ణారావు, రాము పాల్గొన్నారు.

గండేపల్లి: ఆదిత్య యూనివర్సిటీలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు రత్నగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతం



నిత్య కల్యాణ మండపంలో వ్రతానికి చేసిన ఏర్పాట్లు

అన్నవరం: శ్రావణమాసంలోని నాలుగో శుక్రవారం సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో 'సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం' నిర్వహించనున్నారు. సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో ఉదయం ఎనిమిది గంటలకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ జ్యోతిని వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. నిత్య కల్యాణ మండపంతో పాటు నైరుతి, వాయువ్య వ్రత మండపాలలో కూడా ఏర్పాట్లు చేశారు. అలాగే ఉదయం పది గంటలకు రెండో బ్యాచ్‌లో వ్రతం జరుపుతారు. ఈ కార్యక్రమానికి నాలుగు వేల మందికి పైగా మహిళలు వచ్చే అవకాశం ఉండడంతో ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేయించారు. దేవస్థానం వేద పండితులతో పాటు ఆలయ ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్ ఈ వ్రతాలను నిర్వహించనున్నారు. వ్రతాలు చేసుకునే మహిళలు తమ వెంట గాజులు, పువ్వులు, అరటిపండ్లు ,రెండు కొబ్బరికాయలు తెచ్చుకోవాలి. మిగిలిన పూజాద్రవ్యాలను దేవస్థానం అందజేస్తుంది. అలాగే లక్ష్మీదేవి రూపు, తోరం, ప్రసాదం కూడా అందజేస్తారు.